వైభవంగా మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలు

మెదక్ మున్సిపాలిటీ: శిలువను చర్చిలోకి తీసుకొస్తున్న మత గురువులు

మెదక్ మున్సిపాలిటీ: చర్చిలో తెల్లవారుజామున ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ: భక్తులను దీవెనలందిస్తున్న ఇంచార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్

నిజాంపేట: చల్మెడలోని గ్లోరీ పెంటగోస్టల్ చర్చి ఆఫ్ గాడ్‌లో కేక్‌కట్ చేస్తున్న పాస్టర్ రాజు, క్రైస్తవులు

- భక్తులతో కిక్కిరిసిన కరుణామయుడి సన్నిధి
- అంబరాన్నంటిన క్రిస్మస్ సంబురాలు
- ప్రార్థనల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులు
- భక్తులను ఆశీర్వదించిన పాస్టర్లు

మెదక్ మున్సిపాలిటీ/ మెదక్ అర్బన్/ మెదక్ రూరల్/ రామాయంపేట/ నర్సాపూర్/ నిజాంపేట/ వెల్దుర్తి/ చేగుంట/చిలిపిచెడ్, డిసెంబర్ 25: ఆసియాలోనే రెండో అతి పెద్ద చర్చిగా పేరుగాంచిన మెదక్ చర్చిలో బుధవారం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా క్రిస్మస్ సంబురాలు అంబరాన్నంటాయి. తెల్లవారు జామునే 4.30 గంటలకు శిలువ ఊరేగింపుతో ప్రారంభమయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే చాలామంది భక్తులు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడానికి మెదక్ సీఎస్ఐ చర్చికి తరలివచ్చారు. కులమతాలకతీతంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు, సందర్శకులు భక్తిశ్రద్ధలతో ఏసును ప్రార్థించారు. మొదటి ఆరాధనకు మెదక్ డయాసిస్ అధ్యక్ష మండల ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ పాల్గొని భక్తుల నుద్దేశించి వాక్యోపదేశం వినిపించారు.

లోక రక్షకుడిగా వచ్చిన దేవుడు

లోక రక్షకుడిగా ఈ లోకానికి వచ్చిన దేవుడు ఏసుప్రభువు అని మెదక్ ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ రూబెన్ మార్క్ అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని మెదక్ చర్చిలో ఉదయం 4.30 గంటలకు నిర్వహించిన తొలి ఆరాధన ప్రార్థనల్లో పాల్గొని దైవ సందేశం వినిపించారు. ఆసియా ఖండంలోనే ప్రసిద్ధి గాంచిన రెండో అతి పెద్దది మెదక్ చర్చి కావడం విశేషమన్నారు. ఈ మహా దేవాలయం నిర్మించి నేటికి వంద ఏండ్లు కావడం మన జీవితాల్లో ఓ మైలురాయి అన్నారు. 1924 డిసెంబర్ 25న మెదక్ చర్చిలో తొలి క్రిస్మస్ జరుపుకోన్నామని, నేటితో 100వ క్రిస్మస్ జరుపుకోవడం ఆనందాన్నిస్తోందన్నారు.

విశ్వానికి మార్గం చూపే రక్షకుడు ఏసయ్య

విశ్వానికి మార్గం చూపే రక్షకుడు ఏసయ్య, దేవుడే మానవుడిగా ఏసుక్రీస్తు రూపంలో ఈ లోకానికి వచ్చాడని చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య అన్నారు. ఉదయం 10 గంటలకు రెండో ఆరాధన ప్రార్థన అనంతరం భక్తులనుద్దేశించి దైవ సందేశం వినిపించారు. ఈ ప్రపంచానికి సృష్టికర్త ఏసుప్రభువని, ప్రభువు జననం సర్వమానవాళికి సంతోషకరమన్నారు. ప్రభువుని హృదయ పూర్వకంగా ఆరాధించే వారందరికీ విశ్వాసంగా ఉంటారన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాస్టర్లు డేవిడ్, శ్రీనివాస్, జైపాల్ మెదక్ చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సంశాన్ సందీప్, జాన్సన్, సువన్‌డగ్లస్, వసతి గృహాల మేనేజర్ జాయ్ ముర్రె పాల్గొన్నారు.

భారీ ఏర్పాట్లు.. పోలీసుల నిఘా

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సీఎస్ఐ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. బస్సు డిపో ఎదురుగా గల మెయిన్ గేట్ నుంచి మొదలుకుని చర్చి ముఖద్వారం వరకు బారీకెడ్లు ఏర్పాటుచేశారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా డ్రోన్ కెమెరాలతో చర్యలు తీసుకున్నారు.

విద్యుతు కాంతుల మధ్య వెలిగిపోయిన చర్చి

చర్చి ప్రాంగణమంతా రంగురంగుల విద్యుత్తు దీపాలతో శోభాయమానంగా మారింది. భక్తులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇచ్చింది. డయాసిస్, చర్చి కమిటీ సభ్యులతో కలిసి బిషప్ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. భక్తుల కోసం జాయింట్‌వీల్ తదితర ఆట వస్తువులను జాతరలో ఏర్పాటుచేశారు.

నర్సాపూర్: నాగులపల్లి సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రిస్టియన్ ప్రజలు


చిలిపిచెడ్: చిట్కుల్‌లో క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రార్థనలు చేస్తున్న భక్తులు

మెదక్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళ

రామాయంపేట సీఎస్ఐ చర్చిలో ఏసయ్య గుడిసె

చిన్నశంకరంపేటలోని ఓ చర్చిలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

రామాయంపేట: పట్టణంలోని ఏసయ్య సన్నిధిలో క్రిస్మస్ సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న భక్తులు

చేగుంటలోని ఐపో చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

చిన్నశంకరంపేటలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వెల్దుర్తి: కుకునూర్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

ఏడుపాయల వనదుర్గామాతకు ప్రత్యేక పూజలు


ఏడుపాయల వనదుర్గమాతను దర్శించుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వివిధ అభివృద్ధిపనులకు శంకు స్థాపన చేస్తున్న సీఎం, మంత్రులు

- రూ.409.58 కోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పాపన్నపేట, డిసెంబర్ 25: మొదటిసారి ఏడుపాయలకు చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు ఏడుపాయల అధికారులు ఘన స్వాగతం పలికారు. ఏడుపాయలకు చేరుకోగానే ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి రూ.409.58 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌బాబు, ఈవో చంద్రశేఖర్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం సీఎం తో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఎంపీలు రఘునందన్‌రావు, సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు రోహిత్‌రావు, సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, హన్ముంతరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజల ఆశలు అడియాశలు

ఏడుపాయల వనదుర్గామాత సన్నిధికి సీఎం చేరినా ప్రజలను ఉద్దేశించి మాట్లాడలేదు. ఏడుపాయల అభివృద్ధి, పాపన్నపేట మండల అభివృద్ధికి వరాల జల్లు కురిపిస్తారని ఆశగా తరలివచ్చిన ప్రజల ఆశలు అడియాశయ్యాయి. ప్రజలకు అభివాదం చేసుకుంటూ మెదక్ పోయారు. ఈ కార్యక్రమంలో జిల్లా గంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, నీలం మధు, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ సంగీత, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బైక్ ఢీకొని పలువురికి స్వల్ప గాయాలు

క్షతగాత్రులతో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కౌడిపల్లి, డిసెంబర్ 25: ఆటో బైక్ ఢీకొని పలువురికి స్వల్పగాయాలైన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన కుటుంబం ఆటోలో మెదక్ చర్చిని దర్శించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కౌడిపల్లి పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఆటో బైక్‌ను ఢీకొని బోల్తా పడింది అందులో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. ఉప రాష్ట్రపతి పర్యటనకు వెళ్లి తిరిగి వస్తున్న ఎస్పీ వాహనం ఆపి క్షతగాత్రులను దవాఖానకు తరిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

చిన్నశంకరంపేట, డిసెంబర్ 25: చేపల వేటకు వెళ్లి నీట మునిగి మృతి చెందిన చెన్నాయపల్లి గంగక్కల గురుపాదం కుటుంబానికి బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గం ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సౌజన్యంతో రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

ముగిసిన ఉప రాష్ట్రపతి, ముఖ్యమంత్రి పర్యటన

- పటిష్టమైన భద్రత నడుమ పర్యటనలు ప్రశాంతం
- బందోబస్తు నిర్వహించిన మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

బందోబస్తును పరిశీలిస్తున్న మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబర్ 25: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి హెలిక్యాప్టర్‌లో చేరుకున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మొదట కృషి విజ్ఞాన కేంద్రంలో మొక్క నాటిన ఉప రాష్ట్రపతి అక్కడ ఏర్పాట్లు చేసిన సేంద్రీయ ఎరువులకు సంబధించిన స్టాల్స్‌ను పరిశీలించి ఆ తరువాత వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులతో ముచ్చటించారు. ఉప రాష్ట్రపతి ఉపన్యాసం ముగిసిన తరువాత తిరుగు బయలుదేరాని మల్టీజోన్-1 ఐజీ చంద్రవేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్‌రెడ్డి పర్యటన పటిష్ట భద్రత నడుమ ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన మొదటగా ఏడుపాయల వన దుర్గా అమ్మవారిని దర్శించుకొని అక్కడ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి అక్క డినుంచి ప్రపంచ ప్రసిద్ధి సీఎస్ఐ చర్చి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ , గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతను జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బందోబస్తు పర్యటనలను విజయవంతంగా పూర్తి చేసినందుకు బందోబస్తులో విదులు నిర్వహించిన సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు.

ముగిసిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు

గౌరీజీ పురస్కారానికి ఎంపికైన దంపతులకు చెక్కు అందజేస్తున్న అతిథులు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 25: సిద్దిపేట జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు జరిగిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు బుధవారం ముగిశాయి. మూడవ రోజు జరిగిన కార్యక్రమంలో న్యూఢిల్లీలోని నేషనల్ లేబర్ ఇనిస్టిట్యూట్ చీఫ్ అడ్వైజర్ ప్రజ్ఞా పరాండే హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. జనమంచి గౌరీ శంకర్ స్ఫూర్తిని, పనితనాన్ని ప్రతిఒక్కరూ ప్రేరణగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. తన జీవితాన్ని పరిషత్ కోసం అర్పించిన మహోన్నత శక్తి జనమంచి గౌరీ శంకర్ అన్నారు. ఈ మేరకు గౌరీజీ యువ పురస్కారానికి ఎంపికైన ప్రపూర్ణ కిశోర్ దంపతులకు రూ.50 వేల చెక్కును ప్రదానం చేశారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా సలహాదారుడిగా గోనే మార్కండేయులు

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 25 : తెలంగాణ చేనేత ఐక్యవేదిక సిద్దిపేట జిల్లా గౌరవ సలహాదారుడిగా గోనే మార్కండేయులు నియామకమయ్యారు.ఈ మేరకు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ బుధవారం మార్కండేయులకు నియమాక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మార్కండేయులు మాట్లాడుతూ..చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్యాంగంపై విష ప్రచారాన్ని తరమికొట్టాలి

గజ్వేల్, డిసెంబర్ 25: మండల పరిధిలోని అనంతరావుపల్లిలో బుధవారం మనుధర్మ శాస్త్రం ముసుగులో రాజ్యాంగంపై విషప్రచారాన్ని తరిగికొట్టాలని 98వ మనుస్మృతి దహన దినోత్సవంలో భాగంగా దహనం చేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దేశంలో తరతరాలుగా మానవ హక్కులను మనుధర్మశాస్త్రం హరించిందన్నారు. ఈ శాస్త్రం ప్రకారం కుక్కలకు, పశువులకు మంచి నీరు తాగడానికి ప్రవేశం ఉన్నదని కాని సాటి మనిషికి లేని విధంగా మనుధర్మ శాస్త్రం చేసిందన్నారు. కార్యక్రమంలో కొప్పు రవి, రజినికాంత్, గొల్ల మల్లయ్య, దార రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

డిటెన్షన్ విధానం రద్దుతో డ్రాపౌట్స్ పెరుగుతాయి

టీఎస్ యూటీఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి చావ రవి

పద్మారావు

మెదక్, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానం అమలైతే ప్రభుత్వ విద్యా సంస్థల్లో డ్రాపౌట్స్ పెరుగుతారని, పేదలకు విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి పేర్కొన్నారు. బుధవారం టీఎన్జీవో భవన్ మెదక్‌లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఐదో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 ఏండ్ల వయసు వరకు బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాల్సి ఉంటుందన్నారు. 8వ తరగతి వరకు ఏ విద్యార్థిని ఫెయిల్ లేదా నిలుపుదల చేయకూడదన్నారు. రాష్ట్ర కోశాధికారి లక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా 317 బాధిత, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి సమ్మెను వివరింపజేయాలని కోరారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో జరిగే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కే.పద్మారావు, ఉపాధ్యక్షులు సీహెచ్ రవీందర్ రెడ్డి, ఎం.కవిత, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, కోశాధికారి కె.అజయ్ కుమార్, జిల్లా కార్యదర్శులు ఎం.సుధాకర్, పి.నగేశ్, కే.రవి, ఎస్కే నాగుల్ మీరా, సీహెచ్.యేసయ్య, ఎ.అశోక్, ఎన్.శేఖర్, కనకరాజు, మధులత, మంజును ఎన్నుకున్నారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్.రమేశ్‌రాజు, సభ్యులుగా ఎన్.శ్రీనివాస్, ఎ.పోచయ్య, వీ.వెంకటస్వామి, FWF రాష్ట్ర కౌన్సిలర్‌గా బి.భూషణం, ఎండి. షాకీర్ అలీ, జిల్లా క్రీడా కన్వీనర్‌గా డి.శీతల్ సింగ్ ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాయంపేట, డిసెంబర్ 25: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి మృతిచెందిన ఘటన రామాయంపేటలో జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం టీ.మందాపూర్ గ్రామానికి చెందిన అంగడి శ్రీకాంత్ (35) రామాయంపేటలోని ఓ విందుకు హాజరై, తిరిగి తన గ్రామానికి వెళ్తున్నాడు. ఝాన్సీలింగాపూర్ గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకుపోయింది. శ్రీకాంత్ నీటి గుంటలో పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. రామాయంపేట దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయమై రామాయంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత

చిన్నశంకరంపేట, డిసెంబర్ 25: మండలంలోని ఖాజాపూర్ తండాలో సానీక్ష ఫౌండేషన్ నెహ్రూ యువ కేంద్ర ఫౌండేషన్ సౌజన్యంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రిని బుధవారం అందజేశారు. క్రీడల్లోనూ రాణించాలని కోరారు.

ఘనంగా మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి

రామాయంపేట, డిసెంబర్ 25: రామాయంపేటలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దమ్మయ్యగారి భానుచందర్ శంకర్‌గౌడ్, కన్నయ్య, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి వధువుకు పుస్తెమట్టెలు అందజేత

నిజాంపేట,డిసెంబర్25: నిజాంపేటలోని రేణుకా ఫంక్షన్ హాల్‌లో బండారి లక్ష్మీ నర్సింహులు దంపతుల కూతురు వివాహం బుధవారం జరిగింది. ఈ వివాహానికి లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్‌నాయక్ హాజరై వధువుకు పుస్తెమట్టెలు అందజేశారు. కార్యక్రమంలో రాజు, బాబు, రాజు, రాము, ఎల్లం, చంద్రయ్య ఉన్నారు.

రామలింగేశ్వర స్వామివారి క్యాలెండర్ ఆవిష్కరణ

చిలిపిచెడ్, డిసెంబర్25: మండలంలోని చండూర్ గ్రామంలో రామలింగేశ్వర స్వామి వారి క్యాలెండర్‌ను భక్తులు బుధవారం ఆవిష్కరించారు. ఆలయం వద్ద తలారి నర్సింహులు దేవాలయం పేరుతో క్యాలెండర్‌ను తన సొంత ఖర్చులతో ముద్రించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి తమ్మలి విశ్వనాథ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు నారాయణ, కిష్టయ్య, మల్లేశం పాల్గొన్నారు.

పుట్టు పంచలు కార్యక్రమానికి ప్రముఖులు

పాపన్నపేట, డిసెంబర్ 25: పాపన్నపేటలో మోహన్‌రాజ్ మనవల పుట్టు పంచాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మెదక్ నియోజక వర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, మాజీ జడ్పీటీసీ మల్లప్ప, మాజీ ఎంపీపీ చందన ప్రశాంతరెడ్డి తదితరులు హాజరయ్యారు.